క్లుప్తంగా

22న కోటి లింగాల ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని కోటి లింగాల మహాకాళీ సహిత మహా కాళేశ్వరస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అష్టదిక్పాలక పూజ, మహా కాళేశ్వరుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేస్తారని చెప్పారు. ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన శివలింగాలకు భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు నిర్వహించేలా ఏర్పాటు చేసామన్నారు. 9 గంటలకు రుద్ర, దుర్గ, గణపతి మూల మంత్రపూర్వక హోమం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం మహాకాళేశ్వరుడు, మహంకాళీ మాతకు శాంతి కల్యాణం, అనంతరం పల్లకీలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం శనివారం నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి గాబు, ఫ్రిజ్‌లు, కూలర్లు పరిశీలించారు. గాబుల్లో నాలుగు రోజుల కన్నా నీరు నిలువ ఉంచుకోకుండా చూసుకోవాలని చెప్పారు. కాలువల్లో ఎబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు.

నేడు ఇన్సూరెన్స్ కార్యాలయం వద్ద ధర్నా

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో రైతులకు నష్ట పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం, ఇన్సూరెన్స్ కంపెనీ కాలయాపన చేస్తున్నాయని దీనిని నిరసిస్తూ రేపు రైతుల ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదానికి సంబంధించిన రైతులకు ఇంతవరకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ కాలేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం ఉదయం 10.30 గంటలకు తెనాలి మారిస్‌పేట, డాక్టర్ గవిని హాస్పిటల్ వద్ద ఉన్న ఇన్సూరెన్స్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

లాం(తాడికొండ): ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందిన ఘటన మండలంలోని లాం గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన పెరుమాళ్ళ భార్గవ్ రామ్ (20) అనే యువకుడు బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులకు ఇంటికి వచ్చి శనివారం గుంటూరులోని తన స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. లాం పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాన్ని తప్పించేందుకు బ్రేక్ వేయగా అదుపుతప్పి తీవ్ర గాయాలయ్యాయి. స్పృహ తప్పి పడిపోయిన యువకుడిని హుటాహుటిన గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి తండ్రి పెరుమాళ్ల రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

జనసేన కార్యాలయంపై డ్రోన్ కలకలం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంప్ కార్యాలయం, మంగళగిరి జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంపై శనివారం డ్రోన్ ఎగరడం కలకలం రేపింది. మధ్యాహ్నం సమయంలో కార్యాలయంపై ఓ డ్రోన్ దాదాపు 20 నిమిషాల పాటు చక్కర్లు కొట్టినట్లు కార్యాలయ సిబ్బంది వెల్లడించారు. దీంతో అప్రమత్తమై జనసేన నేతలు మంగళగిరి పట్టణ పోలీసులకు, డీజీపీ, జిల్లా ఎస్పీ, కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇదేవిధంగా జరిగిందని, డ్రోన్స్‌పై విచారణ చేయాలని జనసేన నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ఆదాయానికి గండి

- యాడ్ ఏజెన్సీలకు వెన్నుదన్నుగా నగరపాలక సంస్థ
- ఎక్కడికక్కడ భారీ స్థాయిల్లో ఫ్లెక్సీలు
- ప్రకటనలపై దృష్టి పెట్టని అధికారులు
- రూ.లక్షల్లో పేరుకుపోయిన బకాయిలు
- ఖజానాకు ఆదాయం కరువు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పండగలు, వివిధ కార్యక్రమాలకు సంబంధించి ఫ్లెక్సీలు, వ్యాపార ప్రకటనల బోర్డులు ఎక్కడికక్కడ మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో దర్శనమిస్తున్నాయి. వీటి పరిమాణం ఆధారంగా కొంత రుసుం నగరపాలక సంస్థకు చెల్లించి, అనుమతి పొందాల్సి ఉంటుంది. అధికారులు ఆదాయ మార్గాన్ని పట్టించుకున్నట్లు లేరు. మంగళగిరి నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 135 వరకు ప్రకటన బోర్డులు ఉన్నట్లు అంచనా. వీటిలో నాన్ ఏజన్సీలు 90, ఏజన్సీలు 6 ఉన్నాయి. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ సిబ్బందితో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రకటనల బోర్డులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ అటువంటి చర్యలు వారి నుంచి కనిపించడం లేదు.

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థం ఆదాయం పెంపుదిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. క్వాలిటీ లివర్స్, డివైడర్ మధ్య ఏర్పాటు చేసే బోర్డులు స్వయంగా నగరపాలక సంస్థే ఏర్పాటు చేసుకుని వాటికి టెంబర్లు పిలిస్తే ఆదాయం వస్తుందని తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ముఖ్య కూడళ్లలో ప్రమాదకరంగా

ఎంతో రద్దీగా ఉండే ముఖ్య కూడళ్లలో ఆకర్షణీయమైన భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. మంగళగిరి పాత బస్టాండ్ ప్రాంతం, గౌతమ బుద్ధ రోడ్డులోని పెద్ద మసీదు వద్ద, ఎన్ఆర్ఐ వై జంక్షన్ ప్రాంతాల్లో పెద్ద పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రకటనలు అనేవి ఎవరైనా చూడ్డానికే కాబట్టి వాహన చోదకులు వారి డ్రైవింగ్‌పై కాకుండా వాటిపై దృష్టి పెట్టి పలు సందర్భాలలో ప్రమాదాల పాలవుతున్నారు. మరోవైపు రాజకీయ వర్గాల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి.



పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్



ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్

ఆదాయంపై శ్రద్ధలేని అధికారులు

నగరపాలక సంస్థ ఆదాయం పెంచాలన్న ఆలోచన అధికారుల్లో ఏ మాత్రం కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. బయట కనబడే ఫ్లెక్సీలపై, ప్రకటనలపై పన్నులు వేయాలి. ఇప్పటికే లక్షలాది రూపాయల బకాయిలు ఏజన్సీలు చెల్లించాల్సి ఉంది. 2019–2020 నుంచి 2023–2024 వరకు ఏజన్సీల ద్వారా పెట్టిన హోర్డింగ్ ప్రకటనలకు రూ.1.08 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.86.84 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.22.37లక్షల బకాయి ఉంది. నాన్ ఏజన్సీల ద్వారా రూ.25.93 లక్షలు రావాల్సి ఉండగా..రూ.9.59 లక్షలు చెల్లించగా ఇంకా రూ.16.33లక్షలు బకాయిలు ఉన్నాయి. మొత్తంగా ఏజన్సీలు, నాన్ ఏజన్సీల ద్వారా సుమారుగా రూ.38.70 లక్షలు నగరపాలక సంస్థకు బకాయిలు ఉన్నాయి. ఈ బకాయిలను వసూలు చేయడంలో నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. ఏజన్సీల నుంచి ఏమైనా ముడుపులు అందుకుంటున్నారా అనే అనుమానాలు రేకెత్తించడంలో ఎలాంటి సందేహం లేదని బహిరంగంగా అంటున్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలను ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ఏజన్సీల నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయడంలో విఫలమయ్యారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఆదాయంపై దృష్టి



నగరపాలక సంస్థ ప్రకటనల ఆదాయం తక్కువగా ఉంది. ఆదాయంపై దృష్టి సారించి ఏజన్సీల నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేస్తాం. రాజకీయ నాయకుల ప్రకటనల బోర్డులు మూడు రోజులకు మించి ఉండడానికి వీల్లేదు. ఈ మేరకు పట్టణంలో ప్రచారం నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

– అలీమ్ బాషా, నగరపాలక సంస్థ కమిషనర్

కర్నూలు టు తాడికొండ



తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్న వలస కూలీలు



పట్టలతో ఏర్పాటు చేసిన గుడారాలు

రావెల(తాడికొండ): మిర్చి సీజన్ ప్రారంభమవుతోంది. మండలంలో ఉపాధి కోసం వలస కూలీల రాక ఆరంభమైంది. ఏటా సంక్రాంతి ముగిసిన తర్వాత తాడికొండ, మేడికొండూరు మండలాలకు మిర్చి కోతలు, ఇతర ఉపాధి పనుల నిమిత్తం వేలాది మంది వలస కార్మికులు వస్తుంటారు. ఈ ఏడాది ఉపాధి కోసం వలస కూలీల రాక మూడు రోజుల నుంచి ప్రారంభమైంది. వందల సంఖ్యలో ఉపాధి కూలీలు ఈ ప్రాంతానికి చేరుకొని తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రైతులు వీరికి కావాల్సిన బొంగులు, పట్టాలు ఇవ్వడంతో.. తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అవహేళనగా మాట్లాడిన కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. దేశ, రాష్ట్ర రాజకీయాలను, పార్లమెంట్‌ను, ప్రజా స్వామ్యాన్ని ప్రధాని మోదీ, అమిత్‌షా చంపేస్తున్నారని అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మతోన్మాదులు ప్రజల మధ్య విద్వేషాన్ని రగిలించి మహిళలను నగ్నంగా చేసి అవమానపరుస్తూ మారణహోమం సృష్టిస్తుంటే నరేంద్రమోదీ మాత్రం లౌకిక దేశాలను చుట్టిరావడం, తన బాధ్యతగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగల అజయ్‌కుమార్, మంగళగిరి కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు పాల్గొన్నార.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల

ప్రధాని చిత్రం లేదని బీజేపీ నేతల ఆగ్రహం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మంగళగిరిలో శనివారం ప్రారంభించారు. నగరపాలక సంస్థ అధికారులు కార్యక్రమానికి సంబంధించి బ్యానర్లు ఏర్పాటు చేశారు. అయితే ఆ బ్యానర్లలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రం లేకపోవడంతో స్థానిక బీజేపీ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రధాని మోడీ చిత్రం బ్యానర్‌లో లేకపోవడం ఏంటని కమిషనర్ అలీమ్ బాషాను ప్రశ్నించారు. బ్యానర్‌పై ఉన్న ఫొటోలను సరిగా గమనించలేదని కమిషనర్ సమాధానం ఇవ్వడంతో బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశ్యపూర్వకంగా కమిషనర్ అలీమ్‌బాషా నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారంటూ నిరసన వ్యక్తం చేశారు.



ప్రధాని చిత్రం లేని బ్యానర్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి

తాడేపల్లిరూరల్: దివంగత ముఖ్యమంత్రి, సినీ నటుడు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం తాడేపల్లి టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు, సీనియర్ నాయకులు కళ్ల బాపిరెడ్డి, కొత్రపాటి రమణ, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, అద్దంకి మురళి తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి రూరల్ నవులూరు గ్రామంలో గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేమూరి మైనర్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోతినేని శ్రీనివాసరావు, పద్మశాలి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి, టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆకుల జయ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

ఫిరంగిపురం: చిరస్మరణీయుడు నందమూరి తారక రామారావు అని పలువురు నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. కె. కోటేశ్వరరావు, మండవ.నరసింహారావు, కోట శేషు, బందనాథం సతీష్, పుల్లారెడ్డి, అప్పారావు, యోహాను, వెలంగిణీరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరిలో ఎన్టీఆర్ వర్ధంతి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి కార్యక్రమం శనివారం మంగళగిరిలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళగిరి బస్టాండ్, ఎంఎస్ఎస్ భవన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని కొనియాడారు. గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు పాల్గొన్నారు.

రైతు నాయకుడు దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలి

తాడేపల్లిరూరల్: ఢిల్లీలో రైతు నాయకుడు దల్లేవాల్ చేస్తున్న దీక్షకు కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వడ్డేశ్వరం కొలనుకొండ రహదారిలో రైతు సంఘం నాయకులతో ఆయన ధర్నా చేపట్టారు. 70 సంవత్సరాల రైతు నాయకుడు 54 రోజులుగా నిరవధిక దీక్షలో ఉంటూ ప్రాణాపాయ స్థితిలో వున్న జగ్గిత్ సింగ్ ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. క్రిష్ణయ్య, వై. కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ, జొన్న శివశంకరరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛ దివస్



స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు



మొక్కలు పీకుతున్న తహసీల్దార్ సీతారామయ్య



ర్యాలీలో పాల్గొన్న ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని గణపతి నగర్‌లో ఉన్న ఇందిరా నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష మాట్లాడుతూ సెంటర్ ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించామని తెలిపారు. హెల్త్ సెంటర్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛ దివస్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సీతారామయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛత దివస్‌ను నిర్వహించాలని పిలుపునిచ్చాయని తెలిపారు. దీనిలో భాగంగా తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో చెత్తా చెదారం తొలగించామని చెప్పారు. కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేమవరంలో స్వచ్ఛత దివస్ ర్యాలీ

ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా శనివారం గ్రామస్తులు, సచివాలయ సిబ్బందితో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శౌరిజోజి మాట్లాడారు. పరిసరాల శుభ్రత గురించి వివరించారు. వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంగళగిరిని పరిశుభ్రతే లక్ష్యం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి ప్రాంతాన్ని అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దమే లక్ష్యమని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, టీటీడీ పాలక మండలి సభ్యురాలు జానకీదేవి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావులతో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. మంగళగిరి గాలిగోపురం వద్ద నుంచి మిద్దె సెంటర్ వరకు పారిశుద్ధ్య, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల, నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేయాలి

తాడికొండ: స్వచ్ఛాంధ్ర రూపకల్పనలో ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి ఎం.గంగరాజు అన్నారు. శనివారం తాడికొండ బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సర్పంచ్ తోకల సరోజినీ, ఎంపీడీవో కె సమతావాణి, తహసీల్దారు కె.నాసరయ్య ఈవోఆర్డీ శివలీల, ఎస్ఐ జోజి, కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. తుళ్లూరు లైబ్రరీ ప్రధాన కూడలిలో నిర్వహించిన సమావేశానికి ఎంపీడీవో కానూరి శిల్ప ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛత వలన కలిగే ప్రయోజనాలు, ప్రజల సహకారంపై ప్రసంగించారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు సమష్టిగా పనిచేయాలి

ఆత్మీయ సమావేశంలో సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

రాయపూడి(తాడికొండ): వైఎస్సార్ సీపీ పటిష్టతకు సమష్టిగా పనిచేయాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, గుంటూరు నగర డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు అన్నారు. శనివారం తుళ్లూరు మండలం రాయపూడి, లింగాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సమన్వయంతోనే ఏదైనా సాధ్యమవుతుందని, గతంలో ఉన్న లోపాలను విడనాడి వాటిని సరిదిద్దుకొని భవిష్యత్తులో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై నిలిచి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమస్యలు విని వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాజధాని ప్రాంతంలో చేసేందుకు పనులు లేక, ప్రభుత్వం సరైన ఉపాధి చూపించలేని కారణంగా చాల మంది ఖాళీగా ఉంటున్నారని పేదల జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, నాయకులు కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, రాయపూడి గ్రామ నాయకులు జానీ బాషా, పసుపులేటి అనిల్, పుట్టా నాగరాజు, కంభపాటి శ్రీనివాసరావు, లింగాయపాలెం నాయకులు కొండెపాటి సుబ్బారావు, కలపాల ప్రభుదాసు, యశ్వంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

కూరగాయల లారీ బోల్తా

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పరిధిలో శనివారం ఓ లారీ బోల్తా పడింది. సేకరించిన వివరాల ప్రకారం నిడమర్రు రోడ్డులో నిర్మాణం జరుగుతున్న అండర్‌పాస్ సమీపంలో రోడ్డు దాటుతున్న మరో టిప్పర్‌ను కూరగాయల లారీ ఢీకొట్టింది. లారీ బోల్తా పడడంతో అందులో ఉన్న కూరగాయలన్నీ రోడ్డుపై చెల్లాచెదురయ్యాయి. ఈ ఘటనలో లారీలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం టీడీపీ నాయకులు తాడేపల్లి, మంగళగిరి, నీరుకొండ గ్రామాల్లోని బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. తాడేపల్లికి చెందిన మొరతోట సుబ్బారావుకు రూ.3,98,800లు, మంగళగిరి పట్టణానికి చెందిన గొడవల్లి ఆనంద్‌బాబుకు రూ. 1,78,821లు, నీరుకొండ గ్రామానికి చెందిన హరికుమార్‌కు రూ.45 వేల నగదు చెక్కులు అందజేశారు. టీడీపీ నాయకులు షేక్ రియాజ్, కారంపూడి చిరంజీవి, నన్నపనేని నాగేశ్వరరావు, దామర్ల పద్మజ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



మంగళగిరి (తాడేపల్లి రూరల్) : మంగళగిరి రూరల్ యర్రబాలెం గ్రామంలో బేటీ బచావో – బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా శనివారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల చదువుకోవాలని, వారిని సంరక్షించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్యవివాహాలు చట్ట రీత్యా నేరమని, చిన్నతనంలోనే ఆడపిల్లలకు వివాహం చేయడం వల్ల వారు అనేక రకాల మానసిక, శారీరక వేదనలకు గురిఅవుతారని వివరించారు. అంగన్‌వాడీ వర్కర్ జయశ్రీ, టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఎంఎస్కేలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు 1 అంగన్ వాడీకేంద్రంలో కళాజాత ఆధ్వరంలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కె.అమతమ్మ, శ్రీదేవి, నాగలక్ష్మి, సీహెచ్ సుభాషిణి పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటనకు నిరసన

మంగళగిరి (తాడేపల్లిరూరల్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచిన కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా ఏపీ పర్యటనను వ్యతిరేకించాలని సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు పిలుపునిచ్చారు. నిడమర్రులో శనివారం అంబేద్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం నాయకులు నానయ్య, ఎం. అంకమరావు, వీరయ్య పాల్గొన్నారు.